ఆదివారం కథ

# తాకట్టు



**శాస్త్రి పదివేలు అప్పుకావాలన్నప్పుడు ఓబిలేసుకు దిక్కుతోచలేదు. అతడి ముఖం చూడలేదు. అవుననలేదు. కాదనలేదు. తలెత్తలేదు. మనిషిని చూడలేదు. క్లాసుండి శాస్త్రి వెళ్ళిపోయాడు. కదలకుండా కూర్చున్నాడు స్టాఫ్‌రూంలో ఓబిలేసు.**

ఇద్దరూ బాల్యం నుంచి మిత్రులు. కలిసి చదువుకొన్నారు. కలసి ఉద్యోగం చేస్తున్నారు. పర్మినెంటు ఉద్యోగులు. జూనియర్ కాలేజీలో శాస్త్రి తెలుగు, ఓబిలేసు ఇంగ్లీషు చదువు చెబుతున్నారు.

శాస్త్రికి అప్పులు చేయటం అలవాటు. తీర్చకపోవటం పొరపాటు. ముఖం తప్పించటం గ్రహపాటు. తీసుకున్న అప్పు మర్చిపోవటం రూలు.

శాస్త్రికి చెడ్డ అలవాట్లు లేవు. సిగరెట్టు, బీడీలు, చుట్టలు తాగడు. పేకాడడు. జూదమాడడు. రేసులకు పోడు. వ్యభిచారికాడు. ఏకపత్నీ వ్రతుడు. పిల్లలూ ఎక్కువ లేరు. వాళ్ళ చదువుల మీద ఖర్చూ పెద్దగా లేదు.

శాస్త్రికి వచ్చే జీతం చాలదు. అప్పులు చేస్తాడు. ఎందుకు చేస్తాడో, ఏం ఖర్చు చేస్తాడో, ఓబిలేసుకు తప్ప, ఎవరికీ తెలియదు.

శాస్త్రి పదులూ పాతికలూ తీసుకొని మళ్ళీ ఆమాటెత్తకపోవటం ఓబిలేసుకు పరిచయమే. పాతబాకీ తీర్చడు. కొత్త బాకీ చేస్తాడు. ఒక్కచోట కాదు. పుట్టిన చోటల్లా బాకీలు చేస్తాడు.

ఎప్పుడయినా వందలదాకా శాస్త్రి అడిగితే అడిగి ఉండవచ్చు. వేలు, పదివేలు ఎప్పుడూ అడగలేదు.

చేబదుళ్ళిచ్చిన వాళ్ళు మా డబ్బు మాటేంటని అడగటం, శాస్త్రి గుర్తుకు తెచ్చుకోవటం, చూద్దామనటం రివాజు.

శాస్త్రికి అప్పుపుట్టటం తగ్గింది. బాకీ తీర్చమనటం ఎక్కువయింది. ఈ ఐదేళ్ళలో చేసిన అన్నీ బాకీలూ కలిపితే పదివేలుండవచ్చు. బాకీలు తీర్చటానికి బాకీ చేయబోవటం లేదుకదా అని ఓబిలేసు అనుకొన్నాడు.

శాస్త్రికీ, ఓబిలేసుకూ, ఒకే జీతం వస్తుంది. ఓబిలేసు జీతం మిగులుతుంది. శాస్త్రికి జీతం చాలదు. ఓబిలేసు భార్య జీతం అంతా మిగులే.

పాతికేళ్ళ నుంచి అవకాశం వచ్చినప్పుడల్లా నీ భార్యను లెక్చరరుగా చేర్పు అని ఓబిలేసు గుర్తుచేయకపోలేదు

ఉద్యోగం దాస్యం. నిష్ఠాగరిష్ఠ కుటుంబం మాది. నేనెలాగూ ఈ దాస్యవృత్తిలో తలవంపులు తెచ్చుకొన్నాను. నా భార్య ఉద్యోగం చేయాలా? మా యిళ్ళలో స్త్రీలు ఉద్యోగాలు చేస్తారా. ఊళ్ళేలుతారా. అసలు గడపదాటి బైటకి వస్తారా? అంటూ ఏదేదో మాట్లాడేవాడు.

శాస్త్రి, శారద ఎం.ఏ.లో క్లాసు మేట్లు. శారద ఫస్టుక్లాసు. శాస్త్రి సెకండ్ క్లాసు. వాళ్ళది ప్రేమ పెళ్ళి. అయినా జాతకాలు కుదిరాయి. కట్నం కానుకలు అందాయి. ప్రేమపెళ్ళి కూడా పెద్దల పెళ్ళిలా జరిగింది.

మా యిద్దరికీ యతిగుదిరింది అనే వాడు శాస్త్రి. మతి కుదరాలి అని చెప్పేవాడు ఓబిలేసు. వాళ్ళ సంసారంలో చిన్న మెత్తు తేడా లేదు. శారద వంటగదికీ, ఇంటిపనికీ, పురుటి కంపుకూ దేవుడు పుట్టించినట్టు మారిపోయింది.

భోజనాలకు కూర్చున్నప్పుడు శారద మాసిన చీర చూచి ఓబిలేసు దిగులు పడ్డాడు. ఆమె వడ్డించే వన్నీ చూస్తే గుండెజారిపోయింది. ఎవరికివన్నీ, మనకే.


నాకు టొమాటో చట్నీ పెరుగు ఉంటే భోజనం తృప్తి. ఇన్నేం చేసుకోను. తినటానికి ఇన్నా? ఏం, తినలేను, ఎందువల్ల, జీర్ణంగాదు, ఏం? చిన్నతనంలో లేక తినలేకపోవటం వల్ల, ఇప్పుడు? ఉన్నాతింటేటే అరగకపోవడం వల్ల, కష్టం కదా!, జీవించటానికి ఇంత అవసరం లేదు. నాకివన్నీ ఉండాలి? రోజూనా? ఆ ప్రతిరోజు ఇన్ని? ఆ ఒక్కడికే? ఆ ఎక్కువ కావూ? సరిపోవచ్చు

ఇంత తిరిగి తినగలగటం అదృష్టమే. శారద మాసిన చీరకూ, శాస్త్రి అప్పులకూ కారణం ఓబిలేసుకు అర్థమయినట్టుగా ఉంది.

శాస్త్రి భోజన ప్రీతి భార్యకు పరిచయం చేయటానికి వాళ్ళను భోజనానికి పిలిచాడు. భార్య ఆఫీసుకు సెలవు పెట్టి రోజంతా వంట చేస్తూనేఉంది. రకరకాల వంటలు. పిండివంటకాలు.

తిని, త్రేన్చి ఇంకా ఏంతేనా? అని అడిగాడు శాస్త్రి. ఓబిలేసు బిత్తరపోలేదు కానీ, భార్య మాత్రం అదిరిపోయింది.

ఆచార్య కొలకలూరి ఇనాక్



ఈరోజు కొంచెం వెలితి ఉంటే బాగుంటుంది తెమ్మని ఇద్దరికీ బట్టలు పెట్టి పంపారు వాళ్ళు.

తినటం కోసం బతుకుతున్నామో, బతకటానికి తింటున్నామో ఓబిలేసుకు అర్థం కాలేదు. అతను బేంకుకు పోతూ బాగా తినగలిగినవాడు శాస్త్రి ఇంటికి పోతే పండుగే అని లెక్చరర్లు అందరూ అనుకోవటం గుర్తుచేసుకొన్నాడు.

శాస్త్రి క్లాసు నుంచి రాగానే డబ్బేది? అన్నాడు. నూరు నోటిస్తే తీసుకోలేదు. పదివేలు, ఎందుకు? అప్పులు తీర్చాలి. ఈ అప్పు? తీరుస్తా! ఎప్పుడు? తీరుబడిగా!

అందరూ అప్పులు తీర్చమనే వాళ్ళే. ఓబిలేసు అప్పు తీర్చమనడు. అందుకే శాస్త్రి మళ్ళీ అప్పు అడిగాడు. అప్పులు పుట్టని పరిస్థితి వచ్చేసింది. శాస్త్రి గట్టి నిర్ణయమే తీసుకొన్నట్లుంది. శాస్త్రి డబ్బు అన్నాడు. పెద్ద మొత్తమే. అవును. ఎలా తీరుస్తావు? జీతంలోంచి నెలనెలా, జీతం చాలదు కదా! సర్దుకొంటాను.

ఓబిలేసుకు ఆనందంతో పాటు ఆశ్చర్యం కలిగింది. ఏమైనా తాకట్టు పెడితే పదివేలిస్తాను. నేనా? అవును. నీకా? అవును. తాకట్టా? అవును. పత్రం రాసిస్తా! అక్కరలేదు. తాకట్టు పెట్టాలి? నా దగ్గరేముంది? నీయిష్టం.

శాస్త్రి ఇంట్లో గానీ, వంటి మీద గానీ విలువైన వస్తువేదీలేదు. విలువంతా వంటగదిలో తగలబడిపోతూ వుంటుంది. తాకట్టు పెట్టటానికి నా దగ్గరేముంది? ఏమున్నా సరే! ఏమీ లేదనేగా. ఇవ్వననరాదూ! ఇస్తానంటున్నానుగా. ఏం తాకట్టు పెట్టేది? నీ జందెం.

జంధ్యమా? శాస్త్రి బిత్తరపోయాడు. జంధ్యం తడిమిచూచుకొన్నాడు. మిత్రుడి ముఖంలోకి చూశాడు. తాకట్టు పెట్టదగ్గ వస్తువు తన దగ్గరున్నందుకు ఉబ్బితబ్బిబ్బయ్యాడు. నిజంగా జంధ్యమా? అవును. దీనికేం విలువ ఉంది? లేకపోవచ్చు. నువ్వేం చేసుకొంటావు? తాకట్టు, దాచి ఉంచుతా. నేను డబ్బు ఎగరగొడితే? నీ జందెం నా దగ్గరుంటుంది. అది పది పైసల దారం. కావచ్చు. ఏం చేసుకొన్నా అసలూ వడ్డీ గిట్టుబాటు కావు. కావచ్చు.

శాస్త్రి తిక్కపట్టిన వాడిలాగా మిత్రుడి ముఖంలోకి చూశాడు. జంధ్యం మంత్రపువీతం. ద్వితీయ జన్మ. ఉపనయన చిహ్నం. ద్విజలక్షణం. వేదవిద్యాపరిరక్షణ భారం. మోక్షదాయిని. శత్రు సంహారిణి గాయత్రీ మంత్రపరిరక్షితం. ఆలోచిస్తున్న కొద్దీ శాస్త్రికి పిచ్చెక్కుతూ వుంది.

ఓబిలేసు మాట్లాడకుండా కూర్చున్నాడు.


ఇదెందుకు నీకు? తాకట్టు కావాలి! ఎందుకు? నాకు లేవిది.

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 27-12-96

నీకున్నది. మన మైత్రికడ్డమయింది నాక్కావాలి. నీకొద్దు. ఉంటే ఇద్దరికీ జందేలుండనీ. లేకపోతే ఇద్దరికీ లేకపోనీ. ఈ జందెం. నీ జందెం మనల్ని సోదరుల్ని కానీయటం లేదు. మనమధ్య అసమానతల్ని సృష్టిస్తూ వుంది. మనం సమానులం కాలేకుండా వున్నాం. కానీయకుండా ఇది మనల్ని వేరు చేస్తూ వుంది.

దీన్ని తీసిస్తే నువ్వేసుకొంటావా? వేసుకోను. ఏం చేస్తావ్? దాచి ఉంచుతాను. నీకేం లాభం? మనకిద్దరకూ జందేలుండవ్. ఇద్దరు అన్నద మ్ములమవుతాం. ఇద్దరం సమానమవుతాం. ఇద్దరికీ ఐకమత్యం వస్తుంది. ఇద్దరి మధ్యా వైరుధ్యాలుండవు. వైమనస్యాలుండవు. ఆధిక్యం అనాధిక్యం వుండవు. అసమానతలుండవు.

శాస్త్రి మౌనంగా కూర్చున్నాడు. ఓబిలేసూ మాట్లాడలేదు. ఉన్నట్టుండి శాస్త్రి అన్నాడు. జంధ్యం తాకట్టు పెట్టలేను. నీ యిష్టం. తీయలేను. నీ




యిష్టం. నా బ్రాహ్మణ్యం మంటగలుస్తుంది. నీ యిష్టం. ద్విజత్వం గంగలో కలుస్తుంది. పుణ్యమే! కాదు పాపం. కాదు పవిత్రం. కాదు పతనం. కాదు. కాదు. నీ యిష్టం.

ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. ఉన్నట్టుండి శాస్త్రి అడిగాడు. డబ్బుందా? ఉంది. ఎక్కడిది? బాంకు నుంచి తెచ్చా! ఇవ్వటానికే కదా! అవును, ఇవ్వు! తాకట్టు పెట్టు. పెట్టలేను. నీ యిష్టం.

శాస్త్రి చుట్టూ చూశాడు. స్టాఫ్‌రూంలోంచి చాలా మంది వెళ్ళిపోయారు. శాస్త్రి అప్పు అడుగుతున్నాడని. ఓబిలేసు ఇవ్వటంలేదని లెక్చరర్లు గ్రహిం చారు. శాస్త్రి తమనెక్కడ అడుగుతాడోనని కొందరు ముఖం చాటుచేసి ఉంటారు. మూడు దాటింది. నెమ్మదిగా ఒక్కొక్కళ్ళూ ఇంటి పనుల మీద వెళ్ళిపోతున్నారు. ఏమిటి విషయమని అడిగితే చిక్కుబడిపోతామని వాళ్ళ భయం. స్టాఫ్‌రూంలో ఉన్నవాళ్ళు వీళ్ళను చూడటంలేదు. వాళ్ళ పనుల్లో వాళ్ళున్నారు.

ఈ దారాలేం చేసుకొంటావ్? దారాలు కాదు జందెం! ఇది తాకట్టు పెట్టిందాకా డబ్బు ఇవ్వవా? ఇవ్వను! డబ్బు వడ్డీతో సహా చెల్లించి తాకట్టు విడిపించుకొన్నదాకా, తిరిగి జంధ్యం ఇవ్వవా? ఇవ్వను.

శాస్త్రి ఆలోచనల్లో పడ్డాడు. మరణంతో పోదగిందాన్ని మధ్యలో తీయ వచ్చా? శాస్త్రి తీయలేదు. డబ్బు అవసరం. తీయాలి. మంత్రపూతం. తీయరాదు. జంధ్యం మెళ్ళో ఉంటే దారమే. తీస్తే పదివేలు. దారాలకంత విలువ.దారం జంధ్యమయితే విలువ. ఇంత వరకు మెళ్లో ఉంటేనే దానివల్ల మనిషికి విలువ. ఇప్పుడుతీస్తే దానివల్ల మనిషికి విలువ. ఇప్పుడు తీస్తే దాని వల్ల మనిషికి డబ్బు. డబ్బు కావాలి.

నీకే జంధ్యం తాకట్టు పెట్టి, నేను వేరే దారాలు మళ్ళీ మెళ్ళో వేసుకొంటే, జందెం తాకట్టు పెట్టినట్టు కాదు. నీకు తెలియకుండా వేసుకొంటే? వేసు కోలేవు. దారాలే కదా, దొరుకుతాయి. జందెం దొరకదు. నీ జందెం నా దగ్గరుంటుంది. నీకెన్ని దారాలున్నా అవి జందెం కావు. నువ్వు వేసుకోవు. నీకేం నమ్మకం? నీ మీద నాకా నమ్మకం వుంది.

శాస్త్రికి మిత్రుడి మీద, అతడి నమ్మకం మీద సంతోషంగానే వుంది. డబ్బు వస్తుందన్న ఆనందమూ వుంది. జంధ్యం తాకట్టు పెట్టటమంటే బాధగా వుంది.

నేనీ అప్పు తీర్చగలననుకొంటున్నావా? అనుకొంటున్నాను. ఎందువల్ల? నీ మాట నమ్మకం వల్ల. నేను అప్పు తీర్చకపోతే? తీరుస్తావు! ఒకవేళ తీర్చకపోతే, తాకట్టు జందెం తిరిగి నీకు రాదు. రాకపోతే? నీకుజీవితాంతం జందెం ఉండదు. ఉండకపోతే? నీకు బ్రాహ్మణ్యం ఉండదు. ఉండకపోతే? నువ్వూ నా లాంటి వాడివి! అంటే? సోదరుడివి! ఇప్పుడు? బ్రాహ్మణుడివి. అంటే? మిత్రుడివి అంటే? సోదరుడివి కావు. అంటే? అసమానులం. అంటే? ఐకమత్యం లేదు. సోదరత్వం గిట్టుబాటు కాదు.

శాస్త్రి మౌనంగా ఉన్నాడు. ఓబిలేసు కదల్లేదు. డబ్బు తీయలేదు. ఇయ్యలేదు.

డబ్బీ! జంధ్యమిస్తా! జందెమాడ బెట్టు. డబ్బిస్తా.

తెస్తా ఉండు. శాస్త్రి తీశాడు. వస్తా వుండు. ఓబిలేసు లేచాడు. ఇద్దరూ బైటికి నడిచారు.

ఇద్దరూ యూరినల్స్ వైపు నడుస్తున్నారు. జంధ్యం తాకట్టు పెట్టానని ఎవరితోనైనా చెబుతావా? చెప్పను. ఒట్టు? నీకు నాకూ తప్ప ఎవరికీ తెలియదు. సాక్ష్యంగా జందెమే!

యూరినల్స్‌కంపు. నీళ్ళు లేవు. వాసన. భరించలేని దుర్గంధం. ఓబిలేసు ముక్కుమూసుకొన్నాడు. శాస్త్రి మూసుకోలేదు. షర్టు విప్పాడు. వాసన. నీళ్ళులేక ఫ్లష్‌కాదు.మనుషులూరుకోరు. ఒకరి తర్వాత ఒకరు. కంపుకొట్టనీ, ఊపిరి పోనీ. మనుషులు రాకుండా ఉండరు. షర్టు ఓబిలేసు చేతికిచ్చాడు. వాసన. కంపు. గాలిలేదు. వాసన పోదు. నీళ్ళు లేవు. వాసన పోదు. వచ్చినవాళ్ళు ఊరికే పోరు. కంపుతుట్టే రేపుతారు. తేనెటీగల్లాగా వాసన లేస్తుంది. ముక్కు కుదుతుంది. ముఖం గిల్లుతుంది.

వీళ్ళిద్దరూ యూరినల్స్‌లోకి ఊరికే రాలేదు. వచ్చిన పనికాలేదు. యూరిన ల్స్‌తో పనిలేదు. శాస్త్రి చేయి వణకటం వల్ల పని ఆలస్యం అవుతూ వుంది. యజ్ఞోపవీతం. చేయి వణికింది. కంపుముసురుతూ ఉంది. తొమ్మిద్దారాలు. పూర్ణ సంఖ్య. మూడు మూళ్ళు. ముల్లోకాలు. ముక్కోటి దేవుళ్ళు, త్రిమూర్తులు. చేయి వణికింది.

ఓబిలేసు తొందరపెట్టలేదు. కంపు తొందర చేస్తూ వుంది. విశ్వాసం ఆలస్యం చేస్తూ వుంది. అందరూ జంధ్యం తీస్తారు, వేస్తారు. ఇలా కాదు. ఇక్కడ కాదు. ఇందుకు కాదు. ఇది చరిత్రే. శాస్త్రి చేయి వణికింది. ఉపన యనం కానివాడికి, జంధ్యం లేనివాడికి, వేదవిహిత కర్మానుష్ఠానం ఉండదు. వేద దూరుడు కావాలా? వేద బాహ్యుడు కావాలా? వేదమాన్యుడు కావాలా? శాస్త్రి మనిషంతా నిలువునా వణుకుతున్నాడు.

జంధ్యం తాకట్టు పెట్టి, మళ్ళీ దారాలు, బజారులో, అన్ని పనులకూ వాడే దారాలు వాటితో జంధ్యం కర్మ. వేసుకోడు. మాట తప్పడు. కాలం మారింది. తకిలీతో దారం వడుక్కొని జంధ్యం చేసుకొనే కాలం పోయింది.

కాలం మారింది. ధర్మం చ్యుతమయింది. అన్నీ మారిపోతున్నాయి. మనిషి మారటంలేదు. మనిషి ఆకలి మారటంలేదు. ఆకలి పెరుగుతూ వుంది.

యజ్ఞోపవీతం పట్టుకొన్నాడు. నీళ్లుగారుతున్నా కళ్ళు మూసుకొన్నాడు. కళ్ళల్లో ఊరిన్నీళ్ళు దారలవుతున్నాయి. చేయి వణికింది. రెండో చేత్తో పట్టుకొన్నాడు. మనిషి వణికాడు. గోడకానుకొన్నాడు. కంపు మురికి, గోడ రోత. షర్టులేని శాస్త్రి యూరినల్స్ గోడకు వీపు మోటించాడు.

కన్నీళ్ళు షర్టులేని పొట్టమీద పడ్డాయి. జారిపోలేదు. పొట్టంతా తడిసిపోయింది . తీస్తున్న జంధ్యం పొట్టతడిలో పొర్లాడింది. ఇంతకాలం చెమటకు అలవాటు పడ్డ ప్రాణం, ఇప్పుడు కన్నీటిని కౌగిలించుకొంది. పొట్టంతా తారాడింది. పొరాడింది. జన్మభూమి నుంచి వీడ్కోలు తీసుకొంటూ ఉంది.

ఇంతకాలం తలలో పువ్వులాగా, పూజగదిలో అగరొత్తి ధూపంలాగా పొట్ట ఎగరేసిన జండాలాగా ఉన్న జంధ్యం తన ఉనికిని మార్చుకొంటూ వుంది.

దురదపుట్టినప్పుడు అందని వీపుకు తరుణోపాయంగా ఉండే జంధ్యం, వీపుకూ, దురదకూ దూరమవుతూ వుంది. బ్రాహ్మణ్యానికి ప్రతీకగా ఉన్న జంధ్యం అతణ్ణి సామాన్యుణ్ణి చేసింది. మెళ్ళోది చేతిలోకి వచ్చింది.

పది పైసలు విలులేనిది, పదివేలు తెప్పించే శక్తి కలిగి వుంది. శాస్త్రికి ఆశ్చర్యంగా వుంది.

చేతిలోని దాన్ని కుప్పిట్లోకి మార్చుకొన్నాడు. షర్టు తీసుకొన్నాడు. వేసుకొన్నాడు. వణుకులేదు. కన్నీళ్ళు లేవు. ఇదిగో అన్నాడు శాస్త్రి. అంటున్నప్పుడు గొంతు వణికినట్టయింది. ఇవ్వబోయినప్పుడు చేయి అల్లాడినట్టు అనిపించింది.

ఉంచు! ఏం? చెబుతా! ఇద్దరూ స్టాఫ్ రూంలోకి వచ్చారు.

స్టాఫ్ రూం దాదాపు కాళీ అయింది. ఒకరిద్దరు తప్ప అందరూ వెళ్ళిపోయారు. వాళ్ళిద్దరూ వాళ్ల కుర్చీల్లో కూర్చుని టేబిళ్ళ మీదకు వాలారు. తీసుకో. తీసుకొంటా? డబ్బివ్వు! ఇస్తా. జంధ్యం తీసుకోలేదు. డబ్బు ఇవ్వలేదు.

తీసుకో. వద్దు. ఎందుకు? దాన్ని తాకను. ఏం? అది అంటరానిది. శాస్త్రి బిత్తరపోయాడు. నిన్నెవరూ తాకరు. నీ జందేన్నీ ఎవరూ తాకరు. అది తాకరానిది. అంటరానిది. నేను తాకను. మరిద్దరం కలిసి మెలిసి ఉంటాం కదా! నిజమే. జందెం నేనూ ఎప్పుడూ కలిసి మెలిసి లేము.

శాస్త్రి ముఖం మాడ్చుకొని నేను నిన్ను అంటరానివాడని ఎప్పుడైనా అన్నానా? అనలేదు. మరి? నేనంటున్నా? ఏమని? అది అంటరానిదని. ఎవరు అంటరానిది, నువ్వంటరానిదా? నేనంటరానిదా? నేను .ఎందుకు? అది అస్పృశ్యం. నువ్వు స్పృశ్యుడవని నేను అనలేదే? అనలేదు. మీ యింటికి వచ్చాను. నిజమే. భోంచేశాను. నిజమే. మా యింటికి పిలిచాను . నిజమే. మరి దీన్నెందుకు తాకవు. నీకోసం. నీకోసమా? నా పవిత్రత. యజ్ఞోపవీతం పవిత్రత కాపాడటానికా? కావచ్చు. పవిత్రత పేరిట దూరంగా ఉంచుతున్నావు కదా! కాదు.

మరెందుకు జంధ్యం తీసుకోవు నువ్వు! అది మురికిది. ఎందువల్ల? నీ శరీరం వల్ల. నా శరీరం వల్ల అది మురికిది కాదు. పవిత్రమవుతుంది. నేను వేసుకొంటే దారం జంధ్యమవుతుంది. దారం పవిత్రమవుతుంది. అందుకే నీ దృష్టిలో దీనికింత విలువ.

నీ జంధ్యం పవిత్రమయిందయినా, విలువయిందనా, నాకు మాత్రం అది కంపుది, మురికిది. ఎలా? షర్టు మారుస్తావు. ఎప్పుడైనా బనీను మారుస్తావు. కానీ దాన్ని ఎప్పుడో తప్ప మార్చవు. అయితే? చెమట, మురికి కంపు చుట్టుకొని అది చూడు ఎలా ఉందో! ఎలా వుంది? వేసుకొన్నప్పుడు మల్లెపూవులాంటి దారం మాసిన మసిపాతబట్ట పీలికలాగా వుంది. శాస్త్రి మాట్లాడలేదు. దాని వాసన చూడు. యూరినల్స్ కంపు. అక్కడ తీసినందువల్ల. ఎక్కడ తీసినా అంతే.

దాన్నా కవర్లో పెట్టు. పెట్టాడు. అంటించు. అంటించాడు. దాని మీద సంతకం చెయ్. చేశాడు. ఆ సంతకం తన బ్రాహ్మణ్యానికి చరమ గీతంగా అనిపించింది శాస్త్రికి.

కవరు టేబిల్ మీద పెట్టాడు. కళ్ళలో నీళ్ళింకిపోయాయి. కళ్ళు మసకబారాయి. స్వరం క్షీణించింది. తీసుకో తీసుకొంటా!

ఓబిలేసు పేంట్ జేబులోంచి డబ్బుకట్ట ఉన్న కవరు తీసి దాని మీద పెట్టాడు. కింద జందెం కవరు. పైన డబ్బు కవరు. కవర్లు తొలిగిస్తే పైన డబ్బు, కింద జంధ్యం. జంధ్యం తాకట్టు వస్తువు. డబ్బుకట్ట జందెం సొమ్ము.

తీసుకో అన్నాడు ఓబిలేసు. అతడి గొంతు ప్రశాంతంగా, ప్రేమగా, అనునయంగా వుంది.

శాస్త్రి డబ్బు కట్ట కవరు తీసుకొన్నాడు. చూసుకో! అక్కరలేదు. జేబులో పెట్టుకొన్నాడు.


టేబిల్‌మీద వున్న జంధ్యం కవరు ఓబిలేసు పక్కకు నెడుతూ తీసుకో అన్నాడు శాస్త్రి. తీసుకోను. ఓబిలేసు స్పష్టంగా చెప్పాడు.

ఎందుకు తీసుకోవు? నాకు వద్దు. నువ్వే ఉంచుకో. ఎందుకు? అది నీది! తాకట్టుపెట్టాను కదా! నిజమే! తాకట్టు సొమ్ము నీ దగ్గరుండాలి కదా! నిజమే. నా దగ్గరుంటే ఏం? నీ దగ్గరుంటే ఏం? నీ దగ్గరే ఉంచు.

ఈ యజ్ఞోపవీతం నా దగ్గరే వుంచుకోవాలా? అవును. మెళ్ళో వేసుకో వచ్చా! వేసుకోరాదు. ఎందువల్ల? అది తాకట్టు వస్తువు. నాది నా దగ్గరే వుంది. ఉంటుంది. మెళ్లో వేసుకొంటే? వేసుకోవు. ఎంతకాలం? అప్పు తీర్చిందాకా! అప్పుతీర్చకపోతే? జందెం వేసుకోవు.

ఇద్దరూ చెరో పక్కకు నగరం కూడలి నుంచి వేరవుతున్నప్పుడు టవర్ క్లాక్ సాక్షిగా ఓబిలేసు చెప్పాడు. 'శాస్త్రీ! నువ్వు నా అప్పు తీర్చకపోయినా నేను దుఃఖించను' ఆగాడు. మళ్ళీ స్పష్టంగా చెప్పాడు 'ఆనందిస్తాను.' ◆


కోడలు పిల్లా - కొత్త సలహా




మురికి మటుమాయం చేతులు మండవు ఎక్కువ ఖర్చు లేదు
బావి నీటితోకూడా ఉపయోగించవచ్చును.




త్రిపుల్ ఎక్స్ XXX
సూపర్ పవర్ డిటర్జంట్ కేక్

డిస్ట్రిబ్యూటర్స్
భారతి సోప్ వర్క్స్
ఇందిరాగాంధీ నగర్, 12వ లైను,
(నల్లచెరువు) గుంటూరు-3.
ఫోన్ : 225833, 223154

సలహా పంపిన ఈ వారం కోడలు పిల్ల :
B. శారద, గుంటూరు.

ఇలాంటి సలహాలు ఏ కోడలుపిల్లయినా మా కంపెనీ ఎడ్రసుకు కార్డుమీద పూర్తి ఎడ్రసుతో పంపవలెను. నచ్చినవి ప్రచురిస్తాం.